క్లుప్తంగా

మద్యంసీసాల ధ్వంసం



మద్యంసీసాలు ధ్వంసం చేస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: రాజాం టౌన్ సర్కిల్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన మద్యంసీసాలను స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సమక్షంలో శనివారం ధ్వంసం చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఏడాదిలో నమోదైన మొత్తం 172 కేసుల ద్వారా 1,215 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆయా మద్యంసీసాల్లోని మందు అంతా పారబోశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

తెర్లాం: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు హెచ్చరించారు. మండలంలోని కుసుమూరు ఇసుక రీచ్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దారు గొంగాడ సత్యనారాయణతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తున్నారా అని ఆ గ్రామ వీఆర్‌వోను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరా చేయాలంటే తప్పనిసరిగా అనుమతి ఉండాలని, అనుమతి లేకుండా ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్, తదితరులు

రాజాం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తాడ్డి సూరిసత్యంనాయుడు ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు శనివారం కలిసి పరామర్శించారు. సూరిసత్యంనాయుడు మరణం పార్టీకి తీరనిలోటు అని కొనియాడారు. పార్టీ పరంగా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంజరాపు విజయ్‌కుమార్, వంగా శ్రీనివాసరావు, ఓలేటి గణపతి, డాక్టర్ బి.నరేంద్ర, తాడ్డి రాముడు, బాలకృష్ణ, సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, గేదెల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని సోమరాజుపేట గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలు, సదుపాయాలు వర్తిస్తాయన్నారు. మండలంలో 90 శాతం మేర ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఖరీఫ్ పంటలతో పాటు ఉద్యాన పంటలకు సంబంధించి కూడా ఈకేవైసీ చేయడం జరుగుతోందన్నారు.

402 పనులకు రూ.26.54 కోట్లు మంజూరు

బాడంగి: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని తెర్లాం, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, 402 పనులకు గాను రూ.25,54,51,000 మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ రమేష్ శనివారం తెలిపారు. బాడంగి మండలానికి 89 పనులకు గాను రూ.6.61 కోట్లు, బొబ్బిలి మండలానికి 113 పనులకు గాను రూ.7,60,45,000, రామభద్రాపురం మండలానికి 80 పనులకు గాను 5,13,11000, తెర్లాం మండలానికి 120 పనులకు గాను 7,19,65000 మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఒకటో తరగతి నుంచే.. సీబీఎస్ఈ సిలబస్ ఉండాలి

- అన్ని పాఠశాలల్లో అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు



సీబీఎస్ఈ సిలబస్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు తిరుపతినాయుడు

రామభద్రపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే ఒకటో తరగతి నుంచే సీబీఎస్ఈ(సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ అమలు చాలా అవసరమని ఎంపీటీసీ సభ్యుడు మడక తిరుపతినాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో విద్యాశాఖకు సంబంధించిన నివేదికలను ఎంఈవో తిరుమలప్రసాద్ చదివి, వినిపిస్తుండగా, సదరు ఎంపీటీసీ సభ్యుడు లేచి, నిలబడి అన్ని పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకటో తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలులో లేకపోవడంతో కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ల్లో ఆరో తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ తన నివేదిక చదువుతుండగా.. రామభద్రపురం ఎంపీటీసీ-3 బవిరెడ్డి చంద్ర స్పందించారు. స్థానిక కనిమెరక వీధిలో నెలరోజుల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత లేక పిక్క తేలిపోతోందని, ఇంజినీరింగ్ అధికారులు ఇలాగేనే పర్యవేక్షణ చేసేది? నిర్మాణం చేపట్టిన కొన్నిరోజులకే ఇలా శిథిలమైపోయి ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైతే ఎలా అని ప్రశ్నించారు. రొంపల్లిలో నిర్మించిన రైతుసేవా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయని, వాటి పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ బి.శంకరరావు కోరారు. తహసీల్దారు సులోచనరాణి తమ నివేదిక వెల్లడిస్తుండగా మిర్తివలస సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ భూ సమస్యలపై మ్యుటేషన్లు వంటి భూ సమస్యలకు ప్రభుత్వం డబ్బులు వసూలు చేయడం సమంజసంగా లేదని, ఏ రోజైనా రైతులు తిరగబడితే అధికారులు తట్టుకోలేరన్నారు. విద్యుత్ శాఖాధికారులు తమ నివేదికలు చదువుతుండగా తమ గ్రామానికి ఇప్పటివరకు జేఎల్ఎం పోస్టు భర్తీచేయలేదని, దాంతో విద్యుత్ కోతల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏవో వెంకటయ్య మాట్లాడుతూ పత్తి కొనుగోలుకు రాజాంకు చెందిన పరిశ్రమ అనుమతి ఇచ్చారని, ఇక్కడ నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని రాజాంకు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. పక్కనే ఉన్న ముచ్చర్లవలస పత్తి మిల్లుకు అనుమతి వచ్చేలా చూసుకోవాలని ఎంపీటీసీలకు సూచించారు. ఈవోపీఆర్డీ వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, అపర్ణ, ఏపీఎంలు అన్నపూర్ణ, త్రినాధరావులతో పాటు మరికొంత మంది అధికారులు తమ తమ నివేదికలు చదివి, వినిపించారు. ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాసంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో రత్నం, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పదవి ఒకరిది.. పెత్తనం మరొకరిది..



అధికారులను ప్రశ్నిస్తున్న కోటశిర్లాం టీడీపీ నాయకుడు తాడ్డి శ్రీనివాసరావు



ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మిని నిలదీస్తున్న సీతారాంపురం టీడీపీ నాయకుడు కర్రోతు వెంకన్న

రామభద్రపురం: టీడీపీ అధికారంలో వచ్చిన తర్వాత పదవిలో లేకున్నా టీడీపీ నాయకుల పెత్తనం ఎక్కువైపోయింది. భార్యకు పదవి ఉంటే చాలు ఆ పదవి తమదే అంటూ వారి భర్తలు అధికారం చెలాయిస్తున్నారు. ఇదే పరిస్థితి శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కనిపించింది. కోటశిర్లాం గ్రామ సర్పంచ్ తాడ్డి తిరుపతమ్మకు బదులుగా ఆమె భర్త శ్రీనివాసరావు, ఎస్.సీతారాంపురం గ్రామ సర్పంచ్ పి.యమునకు బదులు వెంకటన్నలు సమావేశానికి హాజరై, పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. సాధారణంగా ఎవరైతే ప్రజలతో ఎన్నుకోబడ్డారో వారే సమావేశంలో పాల్గొని, ప్రజల సమస్యలపై గళమెత్తాలి. కానీ కూటమి ప్రభుత్వ హయాంలో దానికి భిన్నంగా జరుగుతోంది. అధికార పార్టీలో ఉన్నాం కదా.. తమను ఎవరు అడగరులే అనే గర్వంతో ఇలా మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని, మిగతా సభ్యులతో పాటు అధికారులను కూడా ఇబ్బందుల్లో పెడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

చెడు అలవాట్ల బారినపడొద్దు

- డీఎస్పీ ఎస్.రాఘవులు



రాజాం సిటీ: కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్ వద్ద డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: చెడు అలవాట్ల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యువత ఎక్కువగా ఖైనీ, గుట్కా, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకుని, ఆ దిశగా ముందుకుసాగాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు మరే ఇతర సమస్యలైనా నేరుగా తెలియజేసేందుకు డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రెండు రోజులకు ఆ బాక్స్ తనిఖీ చేస్తామని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆన్‌లైన్ యాప్‌లు, బెట్టింగ్‌ల జోలికి వెళ్లవద్దని తెలిపారు. కార్యక్రమంలో సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్ఐ నర్సింహమూర్తి, ప్రిన్సిపాల్‌లు ఎం.పురుషోత్తం, సీహెచ్ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో నృత్య రూపంలో డ్రగ్స్ వాడకం అనర్థాలను ప్రజలకు వివరించారు.

బొబ్బిలి: యువత డ్రగ్స్(మత్తు పదార్థాలు) బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, కళాశాల ప్రతినిధులు రమణ, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: తూటికాడ కషాయంతో వరిపంటకు సోకే తెగుళ్లు, దోమపోటు నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ రమాదేవి అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. 30 లీటర్ల ఆవుమూత్రం, 30 కిలోల తూటికాడ ఆకులను కలిపి మరగబెట్టడం ద్వారా తయారైన కషాయం వరి పంటపై పిచికారీ చేస్తే ఆ పంటలో కనిపించే సుడిదోమ, తెల్లదోమను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు రమణ, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌గ్రూప్ తెలుసుకోవాలి



బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ కార్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

రాజాం సిటీ: ప్రతిఒక్కరూ తమ బ్లడ్‌గ్రూప్‌ను తప్పనిసరిగా తెలుసుకోవాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. రెడ్‌క్రాస్ చేపట్టిన వన్ మిలియన్ బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో బ్లడ్‌గ్రూప్ తెలియజేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. మొత్తం 1200 మంది విద్యార్థుల రక్తనమూనాలు సేకరించి, వారి బ్లడ్‌గ్రూప్ తెలియజేశారు. అనంతరం వారికి బ్లడ్‌గ్రూప్ నిర్ధారించే కార్డులు జారీ చేసి, వాటిని భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ నాగేశ్వరరావు, ఆర్ఎల్ నాయుడు, శాంతారావు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణా తరగతులు

బాడంగి: మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ఈ నెల 7వ తేదీ నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శనివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ తరగతుల్లో గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, పంచాయతీలకు ఆదాయం సృష్టించే మార్గాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. రెండు బ్యాచ్‌ల్లో ఒక్కో బ్యాచ్‌కు నాలుగు రోజుల చొప్పున తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం



రూ.50 వేల చెక్కు అందిస్తున్న దాత సురేష్

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయానికి రాజాం పట్టణానికి చెందిన శెట్టి సురేష్, రమణి దంపతులు రూ.50 వేలను విరాళంగా శనివారం అందజేశారు. ఆ గ్రామంలోని పుట్టలో వెలసిన అయ్యప్పస్వామికి అక్కడి కమిటీ సభ్యులు భారీ మందిరం నిర్మించి, ప్రతీ బుధవారం విశేష పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాలకు తమవంతు సాయంగా వారు ఆ నగదును అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

12న విగ్రహాల ఆవిష్కరణ

బాడంగి: రామభద్రపురం మండలంలోని ఆరికతోట హరిజన వీధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ ఈ నెల 12వ తేదీన చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీనాయన, బోనెల విజయచందర్‌లు హాజరవుతున్నారని, ప్రతిఒక్కరూ కార్యక్రమానికి విచ్చేసి, విజయవంతం చేయాలని కోరారు.

రోటరీ క్లబ్ సభ్యుల సమావేశం

బొబ్బిలి: స్థానిక ఎన్నార్ై ఆస్పత్రిలో రోటరీ క్లబ్ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు తమ క్లబ్ ద్వారా చేపడుతున్న, చేయదలిచిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, ఆపద సమయాల్లో ప్రజల ప్రాణాలు రక్షించడమే లక్ష్యంగా రెడ్‌క్రాస్ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించి, పొరుగువారికి చేతనైనా సాయం చేయాలని కోరారు.

అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ దర్శనం



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో అన్నపూర్ణదేవి అవతారంలో కనకదుర్గమ్మ



బాడంగి సోమేశ్వరాలయంలో అన్నపూర్ణదేవి అవతారంలో ఉమాదేవి అమ్మవారు



బాడంగి: పాల్తేరు మల్లిఖార్జున స్వామి ఆలయంలో అన్నపూర్ణ దేవిగా పార్వతీదేవి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గమ్మను చూసి తరించేందుకు భక్తులు పోటీపడుతున్నారు. శనివారం అన్నపూర్ణదేవి అలంకరణలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. జయహో దుర్గాభవానీ, దుర్గమ్మా.. కరుణించమ్మా.. నినాదాలతో పూజా ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. పలుచోట్ల చేపడుతున్న సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– బొబ్బిలి, రాజాం



రాజాం: మేధా దక్షిణామూర్తి పీఠంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి



అంబేడ్కర్ జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాజాం సిటీ: ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక విధానం హామీని తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం నిరసన చేపట్టారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇసుక సమస్యను పరిష్కరించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇసుక దొరకకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకుని, ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తవిటినాయుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సంతకవిటి: తహసీల్దారుకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలుకుతున్న సిబ్బంది

వంగర: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐగా బోనెల రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన జామి మురళి రేగిడి మండల కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో రాజాం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామారావు ఇక్కడకు వచ్చారు.

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పక్కి భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, ఘన స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, తహసీల్దారు కార్యాలయంలో హెచ్‌డీటీగా సుబ్బారావు, ఆర్ఐగా కొల్లి రామ్మోహన్‌లు బాధ్యతలు స్వీకరించారు.

వంగర: స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా తెర్లి మంగమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన మీసాల చక్రపాణి బదిలీపై వెళ్లడంతో వంగర రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎంగా పనిచేస్తున్న మంగమ్మను వెలుగు కార్యాలయం ఏపీఎంగా బదిలీ చేశారు.

తెర్లాం: మండల ఉప తహసీల్దారు(హెచ్‌డీటీ)గా గొంగాడ సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ హెచ్‌డీటీగా పనిచేసిన గాడి భాస్కరరావు మెరకముడిదాం తహసీల్దారు కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంతకవిటి మండలంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన సత్యనారాయణ ఇక్కడికి విచ్చేశారు.

సంతకవిటి: మండల తహసీల్దారుగా బి.సత్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన కల్యాణ్ చక్రవర్తి పలాస బదిలీ కాగా, పలాసలో పనిచేస్తున్న సత్యం సంతకవిటి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

గ్రామసభల్లో గుర్తించిన పనులే చేయిస్తాం



రాజాం: కంచరాం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



రేగిడి: సంకిలి గ్రామసభలో ఉపాధి పనులపై చర్చిస్తున్న ఏపీవో హరనాథరావు

రాజాం: గ్రామసభల్లో గుర్తించిన పనులనే ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేయిస్తామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కంచరాం గ్రామంలో సర్పంచ్ గెడ్డాపు సబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాంబాబులతో కలిసి గ్రామసభ శనివారం నిర్వహించారు. గ్రామస్తులు, వేతనదారులు, రైతుల నుంచి పలు పనులకు సంబంధించి, దరఖాస్తులు స్వీకరించారు. వాటిని గ్రామసభల ద్వారా అమోదించి, ఉపాధి పనుల్లో చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం, గెడ్డాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం పనులను గుర్తిస్తున్నామని ఏపీవో హరనాథరావు అన్నారు. మండలంలోని సంకిలి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. రైతులకు ఉపకరించేలా ఉపాధి పథకం పనులు ఏయే చోట్ల చేపట్టాలన్న అంశంపై వేతనదారులు, రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి, పనులు గుర్తించడం జరుగుతోందన్నారు. సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ సభ్యులు మజ్జి సంధ్యాశ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో పంచాయతీలో చాలా అభివృద్ధి జరిగిందని వివరించారు. రూ.28 లక్షలతో బొడ్డవలసలో డ్రైనేజీ నిర్మాణం, సంకిలిలో రోడ్డు కమ్ డ్రెయిన్ నిమిత్తం రూ.35 లక్షలు కేటాయించామని, చిన్నయ్యపేటలో రూ.22 లక్షలతో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. గ్రామస్తులందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఐకమత్యంతో మెలగి, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు.